రాజాసాబ్.. పాటల ముచ్చట్లు

ప్రభాస్ కథానాయకుడిగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజా సాబ్' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. 'కల్కి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత ప్రభాస్ నుంచి రానున్న సినిమా ఇదే కావడంతో భారీ హైప్ నెలకొని ఉంది. మే 16న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా పాటలపై మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. ఒక్కో పాటను ప్రత్యేకమైన థీమ్‌తో తీర్చిదిద్దబోతున్నట్లు తెలిసింది. కథానుగుణంగా చక్కటి మెలోడీస్‌తో పాటు మాస్ సాంగ్స్‌కు కూడా చోటుందట. భారీ హంగులతో, వైవిధ్యమైన కొరియోగ్రఫీతో, ప్రపంచంలోని అద్భుతమైన లొకేషన్లలో ఈ పాటలను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. ఇటీవల ప్రభాస్ స్వల్పంగా గాయపడటంతో షూటింగ్‌కు విరామం తీసుకుంటున్నారు. త్వరలో ఆయన సెట్‌లోకి అడుగుపెడతారని, మార్చిలోగా సినిమాను పూర్తి చేసే లక్ష్యంతో చిత్రబృందం పనిచేస్తున్నదని చెబుతున్నారు. హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

ఇంటిల్లిపాదీ కలిసి చూసే సినిమా

'' నిజామాబాద్‌లో ఈ వేడుక జరగడం ఆనందంగా ఉంది. ఇంట్లో ప్రతి ఒక్కరూ వచ్చి చూసేలా సంక్రాంతి సినిమా ఉండాలి. అలాగే ఈ సినిమా ఉంటుంది. అనిల్ చక్కగా తీశాడు. మా సినిమాతో పాటు సంక్రాంతికి వస్తున్న డాకు మహారాజ్, గేమ్‌ఛేంజర్ కూడా పెద్ద హిట్లు అవ్వాలి.'' అని వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి కథానాయికలు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిజామాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ట్రైలర్‌ని మించి సినిమా ఉంటుంది. ఇదొక టిపికల్ జానర్. ప్రియురాలికీ, భార్యకీ మధ్య నలిగిపోయే అద్భుతమైన పాత్ర వెంకీ చేశారు. ఆయన కెరీర్లో చాలా గొప్ప పాత్రలు చేశారు. వాటిలో ఇది ఒకటిగా నిలుస్తుంది. ఐశ్వర్య, మీనాక్షి కూడా అద్భుతంగా నటించారు. దిల్‌రాజుగారి బ్యానర్‌లో నేను చేసిన 5వ సినిమా ఇది. ఇన్ని అవకాశాలిచ్చిన రాజుగారికి థ్యాంక్స్. అందరూ ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది.' అని నమ్మకంగా చెప్పారు. ఇంకా నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్, కథానాయికలు ఐశ్వర్యరాజేష్, మీనాక్షి చౌదరి, నరేష్‌లతో పాటు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణగుప్త కూడా మాట్లాడారు. చిత్ర యూనిట్ మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'బాహుబలి-2' రికార్డు బద్దలు

'పుష్ప-2' కొత్త చరిత్ర

బాక్సాఫీస్ వద్ద 'పుష్ప-2' వసూళ్ల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం కేవలం 32 రోజుల్లోనే 1831 కోట్ల రూపాయల వసూళ్లను సాధించి సరికొత్త రికార్డును సృష్టించింది. దీంతో ఈ సినిమా 'బాహుబలి-2'ను (1810 కోట్లు) అధిగమించింది. 32 రోజుల్లో ఇండియాలో అత్యధిక వసూళ్లను సాధించిన తొలి చిత్రమిదేనని, ఇది ఆల్‌టైమ్ రికార్డని మేకర్స్ తెలిపారు. అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన 'పుష్ప-2' ప్రీమియర్ షోస్ నుంచే వసూళ్లలో రికార్డుల మోతమోగించింది. దక్షిణాదితో పాటు ఉత్తర భారతదేశంలో ఈ సినిమాకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. విదేశాల్లో కూడా రికార్డు స్థాయి వసూళ్లను రాబట్టింది. అల్లు అర్జున్ నటన, దర్శకుడు సుకుమార్ టేకింగ్, దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన పాటలు ఈ మాస్ ఎంటర్‌టైనర్ విజయంలో కీలక భూమిక పోషించాయి.

గుడ్ బ్యాడ్ అగ్లీ

తమిళ అగ్ర నటుడు అజిత్‌కుమార్ నటిస్తున్న భారీ పానిండియా సినిమా 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకుడు. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ సినిమా విడుదల కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో తుపాకీ చేతబట్టి సోఫాలో కూర్చున్న అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఇందులోని అజిత్ పాత్రలో మల్టీ లేయర్లుంటాయని, దర్శకుడు అధిక్ రవిచంద్రన్ అద్భుతమైన కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని నిర్మాతలు తెలిపారు. తిష కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రభు, ప్రసన్న, అర్జున్ దాస్, సునీల్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: అభినందన్ రామానుజం, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్.

ముల్లోకాలు ఏలే తల్లి

శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా మంచు విష్ణు కథానాయకుడిగా తెరకెక్కిస్తున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడు. ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో అగ్ర కథానాయిక కాజల్ అగర్వాల్ పార్వతీ దేవి పాత్రను పోషించింది. సోమవారం పాత్ర తాలూకు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'ముల్లోకాలు ఏలే తల్లి..భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి..శ్రీకాళహస్తిలో వెలసిన శ్రీజ్ఞాన ప్రసూనాంబిక..' అంటూ పార్వతీ దేవి వైశిష్ట్యాన్ని తెలియజెపుతూ ఫస్ట్‌లుక్‌ను ఆవిష్కరించారు. పార్వతీదేవి పాత్రలో ప్రసన్నవదనంతో దైవత్వం మూర్తీభవించినట్లుగా కనిపిస్తున్న ఈ పోస్టర్ సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. పాన్ ఇండియా మూవీగా తెరకెక్కిస్తున్న 'కన్నప్ప' చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, ప్రభాస్, బ్రహ్మానందం, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. భారీ వ్యయంతో మోహన్‌బాబు మంచు రూపొందిస్తున్నారు.

ఈ సంక్రాంతి చాలా స్పెషల్

'బెనిఫిట్ షోస్‌కీ, టికెట్ రేట్ల పెంపుకీ ఏపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ విషయంలో సహకరిస్తే బావుంటుంది. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రిక్వెస్ట్ చేస్తా. తుది నిర్ణయం మాత్రం ప్రభుత్వానిదే.' అని ప్రముఖ నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. తెలంగాణలో ఇక టికెట్ రేట్ల పెంపు, బెనిఫిట్ షోలు ఉండవని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని విలేకరులు ప్రస్తావించగా దిల్‌రాజు పై విధంగా స్పందించారు. ఆయన నిర్మించిన గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలు సంక్రాంతి కానుకగా విడుదల కానున్నాయి. ఈ సందర్భంగా సోమవారం దిల్‌రాజు విలేకరులతో ముచ్చటించారు. 'నిర్మాణంలో సంతృప్తినిచ్చిన సినిమాలు కూడా పరిస్థితుల కారణంగా నష్టాలు తెచ్చిపెట్టాయి. బాగా ఆడాల్సిన వకీల్‌సాబ్‌కు కూడా కోవిడ్ వల్ల థియేటర్లు లేకుండా పోయాయ్. వారిసు, ఫ్యామిలీ స్టార్ సినిమాలు డిజప్పాయింట్ చేశాయి. వీటిమధ్య ఊరటనిచ్చిన సినిమా 'బలగం' మాత్రమే. కెరీర్ పరంగా బ్రేక్ తీసుకోవాలని ఓ నెల రోజులు అమెరికా వెళ్లిపోయాను. . ఏదేమైనా సినిమా పరిశ్రమలో సక్సెస్ ఉంటేనే విలువ. అందుకే.. ఇక కథలపైనే శ్రద్ధ పెట్టాలని నిర్ణయించుకున్నా.' అని చెప్పారు దిల్‌రాజు. ఇంకా మాట్లాడుతూ 'గేమ్‌ఛేంజర్'లో మాస్ విజిల్స్ కొట్టే మూమెంట్స్ చాలా ఉంటాయి. శంకర్ సినిమాలో సందేశం, నా సినిమాల్లో విలువలు ఉంటాయని చిరంజీవిగారు ఓ సందర్భంలో అన్నారు. ఈ రెండూ 'గేమ్‌ఛేంజర్'లో ఉంటాయి. నాలుగున్నరేళ్ల ఎమోషన్స్‌కు నాలుగురోజుల్లో ఫలితం రానుంది. ఇక 'సంక్రాతికి వస్తున్నాం' సినిమాను ఆల్‌రెడీ అందరూ సూపర్‌హిట్ అంటున్నారు. ఈ బజ్‌కి కారణం దర్శకుడు అనిల్ రావిపూడి. కచ్చితంగా రానున్న గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు నా కమ్ బ్యాక్ ఫిల్మ్స్. నో డౌట్' అని నమ్మకం వెలిబుచ్చారు దిల్‌రాజు. 'గేమ్‌ఛేంజర్' రాజమండ్రి ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వచ్చి, తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదం వల్ల ఇద్దరు అభిమానులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి కుటుంబాలకు నిర్మాత దిల్‌రాజు చెరో అయిదు లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు.

గాలి ఊయలలో..

జీవా, రాశీఖన్నా జంటగా నటిస్తున్న చిత్రం 'అగాథియా'. పీరియాడిక్ హారర్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి పా.విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నెల 31న విడుదలకానుంది. ఈ సినిమాలో 'గాలి ఊయలలో..' అంటూ సాగే మెలోడీ గీతాన్ని సోమవారం విడుదల చేశారు. యువన్‌శంకర్ ఈ పాటను స్వరపరిచారు. ఇళయరాజా సిగ్నేచర్ పియానో పీస్‌తో ప్రారంభమైన ఈ పాట సోల్‌ఫుల్ మెలోడీగా మెప్పిస్తుందని, యువన్‌శంకర్ కంపోజ్ చేసిన మెలోడీ పాటలన్నింటిలో ఉత్తమంగా నిలుస్తుందని దర్శకుడు పా. విజయ్ ధీమా వ్యక్తం చేశారు. తాను ఇప్పటివరకు ఎన్నో మెలోడీ పాటలకు బాణీ కట్టానని, అన్నింటిలో ఈ పాట చాలా ప్రత్యేకమని స్వరకర్త యువన్‌శంకర్ రాజా పేర్కొన్నారు. ఫాంటసీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో విజువల్స్ అబ్బురపరుస్తాయని, వెండితెరపై సరికొత్త ప్రపంచాన్ని చూసిన అనుభూతికిలోనవుతారని మేకర్స్ తెలిపారు.

టీ సిరీస్‌లో 'అమరన్' దర్శకుడి సినిమా

తమిళ చిత్రం 'అమరన్'తో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపును తెచ్చుకున్నాడు రాజ్‌కుమార్ పెరియసామి. శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన ఈ సినిమా దేశభక్తి, ప్రేమ, కుటుంబ అనుబంధాల నేపథ్యంలో ప్రేక్షకుల్ని మెప్పించింది. సున్నితభావోద్వేగాలను హృద్యంగా తెరపై ఆవిష్కరించాడని దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామిపై ప్రశంసలొచ్చాయి. ఈ నేపథ్యంలో బాలీవుడ్ అగ్ర నిర్మా సంస్థ టీ సిరీస్ రాజ్‌కుమార్ పెరియసామితో భారీ పాన్ ఇండియా సినిమాకు సిద్ధమవుతున్నది. ఈ విషయాన్ని టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్ ప్రకటించారు. 'అమరన్' చిత్రంలో దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి స్టోరీ టెల్లింగ్, సినిమాటిక్ బ్రిలియన్స్ తమను ఎంతగానో ఇంప్రెస్ చేసిందని భూషణ్ కుమార్ అన్నారు. టీ సిరీస్ వంటి గొప్ప సంస్థలో సినిమా ఛాన్స్ రావడం ఆనందంగా ఉందని, 'అమరన్' స్థాయిలోనే ఈ సినిమా కోసం మంచి కథను సిద్ధం చేస్తున్నానని దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి పేర్కొన్నారు. ఈ ఏడాది చివరలో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది. త్వరలో నటీనటుల వివరాలను ప్రకటించనున్నారు.

సాగరంలో సాహసయాత్ర

మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న చిత్రం 'కింగ్‌స్టన్'. కమల్‌ప్రకాష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్నది. సోమవారం జీవీ ప్రకాష్ కుమార్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'సముద్రం నేపథ్యంలో సాగే యాక్షన్ అడ్వెంచర్ చిత్రమిది. సాగర గర్భంలో నిధుల అన్వేషణ కోసం హీరో చేసే సాహసయత్నాలు, ఈ క్రమంలో చోటుచేసుకునే సంఘటనలు ఆద్యంతం ఉత్కంఠను పంచుతాయి. ఈ కథలో థ్రిల్లింగ్, సూపర్‌నేచరల్ అంశాలుంటాయి. యాక్షన్ ఘట్టాలు రోమాంచితంగా సాగుతాయి. ఈ నెల 9న టీజర్‌ను విడుదల చేయబోతున్నాం'అని తెలిపారు. దివ్యభారతి, ఆంటోని, చేతన్, కుమార్ వేల్, సాబుమోహన్ తదితరులు చిత్ర తారాగణం.

హత్యా రహస్య ఛేదనలో..



ధన్య బాలకృష్ణ, పూజా రామచంద్రన్, రవి వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'హత్య'. శ్రీవిద్యా బసవా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్. ప్రశాంత్ రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం నటుడు రవివర్మ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ ఇది. ఓ హత్యా రహస్యం ఛేదనలో చోటుచేసుకునే పరిణామాలు ఉత్కంఠను పంచుతాయి. రెగ్యులర్ మర్డరీ మిస్టరీ థ్రిల్లర్స్‌కు భిన్నంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిరాజ్ రాజేంద్రన్ నాయర్, సంగీతం: నరేష్ కుమారన్, రచన-దర్శకత్వం: శ్రీవిద్యా బసవా.

ఎన్టీఆర్ సినిమాలో మలయాళ స్టార్స్?

గోపీచంద్ 'రణం' సినిమాతో బిజూ మీనన్ తెలుగులో గుర్తింపు తెచ్చుకున్నారు. మలయాళ చిత్రం 'అయ్యప్పనుం కోషియుమ్' నటుడిగా బిజూ మీనన్ ఏంటో చెప్పింది. 'భీష్మానాయక్'గా ఆ సినిమా తెలుగులో రీమేక్ అయితే.. బిజూ మీనన్ పాత్రను పవన్‌కల్యాణ్ పోషించారు. దీంతో తెలుగులో కూడా బిజూ మీనన్ పేరు బాగా వినపడింది. అలాగే టోవినో థామస్. ప్రస్తుతం మలయాళంలో మంచి క్రేజ్ ఉన్న యంగ్ హీరో. ఏడాదిన్నర క్రితం విడుదలైన ఆయన '2018' సినిమా తెలుగులోనూ బాగా ఆడింది. ఆ విధంగా వీరిద్దరూ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులే. ఇప్పుడు వీరి గురించి టాపిక్ దేనికంటే.. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ సినిమాలో వీరిద్దరూ భాగం కానున్నారు. టాలీవుడ్‌కీ తారక్, శాండల్‌వుడ్‌కి ప్రశాంత్‌నీల్, రుక్మిణీ వసంత్.. మల్లూవుడ్‌కి బీజూమీనన్, టోవినో థామన్.. మొత్తానికి అన్ని భాషల్లోని స్టార్స్‌నీ ఈ పానిండియా సినిమాతో ఏకం చేస్తున్నారు ప్రశాంత్‌నీల్. ముందుముందు ఈ ప్రాజెక్టులో ఇంకెందరు భాగం అవుతారో చూడాలి. సంక్రాంతి తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఉంటుందని సమాచారం.

అంతకంటే ఆనందం ఉంటుందా?

' 'గేమ్ చేంజర్'లో నా పాత్ర పేరు పార్వతి. విశేషమేంటంటే.. మా అమ్మ పేరు కూడా పార్వతే. శంకర్‌గారు ఈ క్యారెక్టర్ గురించి చెప్పినప్పుడు మా అమ్మే గుర్తొచ్చింది. ఈ పాత్ర నుంచి నుంచి చాలా కోరుకుంది. అదే స్థాయిలో నటించానని అనుకుంటున్నా. నటిగా ఇది నా కెరీర్‌లోనే బెస్ట్ సినిమా.' అని నటి అంజలి అన్నారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా, శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మించిన 'గేమ్ చేంజర్' సినిమాలో వన్ ఆఫ్ ది హీరోయిన్ అంజలి. సంక్రాంతి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో ఆమె విలేకరులతో ముచ్చటించింది. 'ఈ పాత్ర గురించి నేను ఎక్కువగా చెప్పకూడదు. కథకు, ఈ పాత్రకూ ఉన్న బంధం అలాంటిది. పార్వతిగా నా నటన చూసి శంకర్‌గారు చాలా చోట్ల మెచ్చుకున్నారు. లొకేషన్ నుంచి ఇంటికొచ్చాక కూడా ఈ పాత్రనన్ను వెంటాడుతూనే ఉండేది. విడుదలకు ముందే ఇందులోని నా పాత్రకు నేషనల్ అవార్డు వస్తుందని చాలామంది అంటున్నారు. అదే నిజమైతే అంతకంటే ఆనందం ఏముంటుంది.' అని పేర్కొన్నారు అంజలి. ఈ సినిమా నేపథ్యం, ఈ పాత్ర నాకు కొత్త. అందుకే నటించేదుకు కష్టపడాల్సొచ్చింది. తెరపై పార్వతిగా నన్ను చూసి ఆడియన్స్ థ్రిల్ ఫీలవుతారు. అప్పన్న, పార్వతి ప్రేమబంధం గొప్పగా ఉంటుంది.' అని తెలిపింది అంజలి. చిరంజీవి సినిమా చూసి తన పాత్రను మెచ్చుకున్నారని తెలిసి చెప్పలేని ఆనందం కలిగిందని, రామ్ చరణ్‌తో వర్క్ చేయడం అద్భుతమైన అనుభవమని అంజలి ఆనందం వెలిబుచ్చింది.